
ప్రజాశక్తి

బుధవారం 8 అక్టోబర్ 2025

5

పార్వతీపురం మన్యం



10 నుండి బోధనేతర పనులకు బహిష్కరణ

వీరఘట్టం: ఈనెల 10 నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ఎం.పైడిరాజు, ఎం.మురళి, ఆర్.ధనుంజయనాయుడు, బి.దుర్గాప్రసాద్, ఎ.సూర్యనారాయణ, వి.అన్నాజీరావు, ఫ్యాప్టో సంఘ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠాలు చెబుతాం పిల్లలకు భోజనం పెడతాం, విద్యా శక్తి కార్యక్రమం బహిష్కరణ చేస్తాం, జీఎస్టీ 2.0 వంటి రాజకీయ కార్యక్రమాలు పాఠశాలలో జరగనివ్వం, బోధనేతర పనులు బహిష్కరణపై ఈనెల 10న జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి మెమొరాండం ఇవ్వాలని తీర్మానించినట్టు తెలిపారు. సిపిఎస్‌పై సరైన నిర్ణయం చేయకుంటే మరో ఉద్యమం కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తక్షణమే 12వ పిఆర్‌సి చైర్మన్ నియమించాలని, తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, తక్షణమే కారుణ్య నియమకాలు చేపట్టాలని, ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యేక పోరుబాట చేపట్టేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కనుల నిండుగా సిరిమాను పండగ

- పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖా మంత్రి రాంనారాయణరెడ్డి
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన జనం
- వర్షంతో గంట ఆలస్యంగా సిరిమాను ప్రారంభం



సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న అశేష జనం



అమ్మవారికి మొక్కును చెల్లిస్తున్న యువకుడు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్, కోట, కంటోన్మెంట్

ఉత్తరాంధ్ర ప్రజలు ఇలవేల్పుగా భావించే పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. లక్షలాది మంది తిలకించడంతో విజయనగరం పులకించిపోయింది. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సిన సిరిమానోత్సవం భారీ వర్షం పడడంతో ఆలస్యంగా సుమారు 4.15 గంటలకు ప్రారంభమై సుమారు 5.50 గంటలకు ముగిసింది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పి ఎఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేథుమాధవన్ దగ్గరుండి పర్యవేక్షించారు. సంప్రదాయబద్దంగా పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. సిరిమానుకు ముందు భాగంలో సంప్రదాయంగా పాలధార, అంజలి రథం, తెల్ల ఏనుగు, బెస్తవాని వల ఒకదాని తరువాత ఒకటి ముందుకు సాగాయి. సిరిమాను అమ్మవారి ఆలయం నుంచి కోట గుమ్మం వరకు మూడుసార్లు ఊరేగింది. జిల్లా నలుమూలలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం జాతరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, అరటి పండ్ల విసిరి, కొందరు కోళ్లను చూపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకను భక్తజనం కనులారా తిలకించి పులకించారు.

సిరిమానోత్సవాన్ని పూసపాటి వంశీయులు, మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబీకులు, జిల్లా ఇంచార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కోట పైనుంచే తిలకించారు. రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తమ కుటుంబ సభ్యులతో అర్బన్‌బ్యాంకు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి తిలకించారు.



ఘటం తీసుకెళ్తున్న మహిళ

కూలిన బొత్స కుటుంబం కూర్చున్న వేదిక

అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వేదికపై శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య కుటుంబ సభ్యులు కూర్చొని సిరిమానోత్సవాన్ని తిలకించారు. అయితే ఒక్క సారిగా వేదిక కూలిపోవడంతో కూర్చున్న వారికి పెద్ద ప్రమాదమేమి జరగలేదు. స్థానికంగా ఉన్న విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్‌తో పాటు ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి.

అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

సిరిమానోత్సవం సందర్భంగా పైడితల్లి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శకర్త, గోవా గవర్నర్ పి.అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోంశాఖా మంత్రి వి.అనిత, రాష్ట్రఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ హరి జవహర్‌లాల్, జిల్లా జడ్జి బబిత తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. శాసమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ కుటుంబీకులు, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, సిఇఒ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి దర్శించుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు కుటుంబసభ్యులు



అమ్మవారిని దర్శించుకుంటున్న అశోక్‌గజపతి కుటుంబీకులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనిత

సిజెఐపై దాడికి నిరసనగా ఆందోళనలు

ప్రజాశక్తి -పార్వతీపురం

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై చెప్పు దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ నుంచి కోర్టు వరకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన నిరసన ర్యాలీ జరిగింది. చీఫ్ జస్టిస్‌పైన దాడిని రాజ్యాంగంపై దాడి అని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. సిబిఐ, ఇడి, ఎలక్షన్ కమిషన్ లాగే న్యాయవ్యవస్థను బెదిరించి లొంగదీసుకునే కుట్రలో భాగంగా మతోన్మాదశక్తులు ఈ దాడికి దిగాయనిచెప్పారు. లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని మతోన్మాదుల నుంచి రక్షించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన, రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడుతూ సిజెఐపై ఓ న్యాయవాది చెప్పు విసిరేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని, దీన్ని ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు. సదరు న్యాయవాదిపై కఠిన చర్యలు చేపట్టాలని, ఇలాంటి మతోన్మాదాన్ని ప్రోత్సహించే దాడులను ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వై.మన్మధరావు, నాయకులు దన్నాన త్రినాధ, గేదెల సత్యనారాయణ, ఆవు సాంబమూర్తి పి.అప్పారావు, జోజి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : చీఫ్ జస్టిస్ గవాయిపై బూటు విసరడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. పట్టణంలోలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు మాట్లాడారు. సిజెఐ గవాయికు తగిన రక్షణ వెంటనే కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రజలు, మేధావులు ఇలాంటి ఘటనలను ఖండిస్తూనే, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, రవి, ప్రసాదు, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పాలకొండ : చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దావాల రమణారావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎ.భాస్కరరావు, పి.సాంబయ్య, జి.శ్రీరాములు, బి అప్పారావు, ఎం కాంతారావు, ఎ.గంగాధర్, దూసి దుర్గారావు, కాదా రాము, ఎ.సురేషు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గువాయిపై దాడి చేసిన న్యాయవాదిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమైన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గువాయిపైన ఒక న్యాయవాది దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దాడి చేసిన న్యాయవాదిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

పచ్చకామెర్ల కేసులు తగ్గుముఖం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పచ్చకామెర్లు (జాండీస్), హెపటైటీస్‌తో ఆసుపత్రిలో చేరిన విద్యార్థుల కేసులు తగ్గుముఖం పట్టాయని, ఇది శుభపరిణామమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌తో కలిసి మంగళవారం కురుపాం గురుకుల పాఠశాలను, పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో సుమారు 90 మంది విద్యార్థులు చికిత్స పొందుతుండగా, అందులో మంగళవారం ఉదయం 16 మంది, మధ్యాహ్నం మరో 19 మంది విద్యార్థులను డిస్చార్జ్ చేసి వారి ఇళ్లకు పంపించినట్టు కలెక్టర్ తెలిపారు. అలాగే విశాఖ కెజిహెచ్‌కు పంపిన వారిలో 13 మంది కోలుకున్నారని, వారిలో 8 మందికి పూర్తి ఆరోగ్యంగా ఉన్నందున, వారిని వెనక్కి పంపుతున్నట్లు చెప్పారు. ఎప్పుడైనా చిన్నపాటి ఆరోగ్య సమస్య ఉన్నా వెంటనే తమకు తెలియజేస్తే ఇంటి వద్దకే అంబులెన్సును పంపిస్తామని, స్థానిక వైద్యం చేయించరాదని కలెక్టర్ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం సబ్ కలక్టర్ ఆర్.వైశాలి, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ జి.నాగభూషణరావు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు నాగ శివజ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారతా అధికారి ఆర్.కృష్ణవేణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదవండి.. మీకు మేమున్నాం : డిశ్చార్జ్ అయిన విద్యార్థులకు కలెక్టర్ భరోసా

విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆకాంక్షించారు. అనారోగ్యానికి గురై చికిత్స పొంది స్థానిక జిల్లా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 16 మంది విద్యార్థులతో కలెక్టర్ మంగళవారం కలెక్టర్ తన సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురై త్వరగా కోలుకొని తమ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందొద్దని, ఏ సమస్య వచ్చినా మేమున్నామని, అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. గురుకుల పాఠశాలకు అవసరమైన ఆర్ఒ ప్లాంట్ సిద్ధమైందని, కొత్త మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంకా ఇతర సదుపాయాలు, మౌలిక వసతులు అవసరమైతే కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువుతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చి వడగట్టిన నీటినే తాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా బిసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

విద్యార్థినులను పరామర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినుల ను గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఉదయం కురుపాం గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డిలతో కలిసి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ను పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడేందుకు ఎంఎం నాయక్ తిరస్కరించారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యం బారినపడి మృతి చెందిన విద్యార్థులు అంజలి, కల్పన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.రామస్వామి తదితరులతో కలిసి సందర్శించి మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, డైనింగ్ హాలు, డ్రైనేజీ, తరగతిగదులు, పరిసర ప్రాంతాలు క్షుణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మితో మాట్లాడి విద్యార్థులు అనారోగ్యం బారినపడ్డానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ చదువుతున్న 611 విద్యార్థులు అనారోగ్యం బారినపడ్డారని గిరిజన సంఘాలు, సిపిఎం 11 రోజులుగా ఆందోళన చేపట్టి మీడియాలో వార్తలు రావడంతో అధికార యంత్రాంగం స్పందించిందన్నారు. అప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యమందిస్తున్నారు తప్ప అంతవరకు స్పందించిన దాఖాల్లేవన్నారు. ఇప్పుడు అధికారులు, మంత్రులు వచ్చి తూతూ మంత్రంగా నష్ట నివారణ చర్యలు చేపట్టి, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మార్చడం తాత్కాలిక చర్యలు చేపట్టడం సరికాదని అన్నారు. మరోపక్క ఏకలవ్య పాఠశాలలో కూడా విద్యార్థులు పచ్చకామెర్ల బారిన పడుతున్నారన్నారు. కావున జిల్లాలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు మౌలికవసతులు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచోగిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు ,సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున అందర్నీ కదిలించి ఆందోళన చేపడుతామని అన్నారు.

గిరిజన సంక్షేమ మంత్రి గారు మీకు ఇది తగునా...?

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సమంజసం కాదని, మీకిది తగునా అని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు అన్నారు. సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఇన్చార్జి మంత్రి వచ్చి వెళ్లారు తప్ప కనీసం క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించే దాఖలాల్లేవన్నారు. సొంత జిల్లాలో సంఘటన జరుగుతే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కనీసం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించిన దాఖాల్లేవని, దసరా సెలవులకు పిల్లలు వెళ్లిపోయారు... మాకు సంబంధం లేదన్నట్టు మాట్లాడుతున్నారని అలా అయితే ఇప్పుడు అనారోగ్యం బారిన పడిన 140 మంది విద్యార్థులకు ఎందుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి, కెజిహెచ్‌లో వైద్యం అందిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెలవులకు ఇంటికి వెళ్తే వారు గిరిజన విద్యార్థులు కారా గురుకుల పాఠశాలలో చదవడం లేదానని, మంత్రి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని డిమాండ్ చేశారు.



గిరిజన గురుకుల పాఠశాలలోని భోజనశాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అంజలి కుటుంబ సభ్యులకు సిపిఎం పరామర్శ

గుమ్మలక్ష్మీపురం : పచ్చకామెర్లతో మృతి చెందిన విద్యార్థిని పువ్వల అంజలి కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విద్యార్థి అంజలి మృతి చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కద్రక రామస్వామి, జియమ్మవలస మండల కార్యదర్శి కె.సీతారాం , గుమ్మలక్ష్మీపురం మండల నాయకులు పువ్వల తిరుపతిరావు ఉన్నారు.

మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సోమవారం మీడియాతో మాట్లాడిన తీరు బాధ్యతా రాహిత్యంగా ఉందని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ విద్యార్థినులు ఇంటి వద్ద చనిపోయారని మంత్రి సంధ్యారాణి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మా తప్పులేదని తప్పించుకొనేలా ఆమె మాట్లాడిన తీరు వుందన్నారు. జబ్బుతో బాధపడుతున్న బాలికలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఇంటికి వెళ్లక ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు పిల్లలు చనిపోయారని అన్నారు. టిడిపి ప్రభుత్వం చాలా బాధ్యతగా గిరిజన విద్యార్థులను చూసుకొంటున్నదని మంత్రి సంధ్యారాణి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంత బాగా చూసుకొంటే ప్రభుత్వవైద్యులు చేసిన రక్తపరీక్షలో 120 మందికి పచ్చకామెర్లు నిర్ధారణ ఎందుకు అయ్యింది? అంత మందికి ఒక్క రోజులో జబ్బు రాలేదు కదా? కనీసం 15 రోజులైనా పట్టింది కదా? అని ప్రశ్నించారు. ఇన్ని రోజులు మంత్రిగా మీరు, మీ ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. పది రోజులు కిందట ఇద్దరు విద్యార్థినులు చనిపోయినా, గత పది నెలల్లో 11 మంది విద్యార్థులు చనిపోయినా టిడిపి ప్రభుత్వం నిద్రపోతుందా? లేక గిరిజనుల పిల్లల ప్రాణాలకు విలువ లేదు అనుకున్నారా? అని ప్రశ్నించారు. ఎందుకు ఇంత నిర్లక్ష్యం వ్యవహరించారో మంత్రి సంధ్యారాణి చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఎఎన్ఎంలను నియమించి తమ ప్రాణాలు రక్షించమని విద్యార్థులు ఆందోళన చేస్తున్నా నియమించలేదని, తమ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల బాధ్యతగా ఉంటున్నదని మంత్రి చెప్పడం విడ్డూరమేనన్నారు. మట్టి ఖర్చులకు రూ.5వేలు ఇచ్చామని, ఇంకేమి చేయాలో ఆలోచించి చేస్తామనడం సరికాదని కృష్ణమూర్తి అన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం : దోస్త్ మేరా దోస్త్, హెల్పింగ్ హాండ్స్, కింగ్స్ యూత్ సహకారంతో శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయనగరం వైద్యులు శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచి సర్పంచ్ బొత్తాడా గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీరామ్మూర్తి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో120 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.


విద్యార్థినికి పండ్లు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యార్థులను పరామర్శించిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల పచ్చకామెర్ల వ్యాధి బారినపడి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను యుటిఎఫ్ మన్యం జిల్లా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థులకు పండ్లు అందించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కెవిజయగౌరి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటనలో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అనంతరం వారికి పౌష్టికాహారం కొరకు ఆర్థిక సాయం అందించాలన్నారు. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరందించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని, అన్ని పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని కోరారు. తగు విచారణ జరిపి భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా తగు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శి కె గోవిందమ్మ, ఆడిట్ కన్వీనర్ పి వెంకట నాయుడు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌కు అనుమతి మంజూరు చేయాలి

కలెక్టర్‌ను కోరిన మున్సిపల్ చైర్ పర్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణం లో నిరాశ్రయుల వసతిగృహం నిర్వహణకు ఆదర్శ్ రూరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థకి అనుమతి మంజూరు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆమె కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2024 వరకు ఐఆర్‌పిడబ్ల్యు సంస్థ ఈ వసతిగృహాన్ని నిర్వహించేదని చెప్పారు. అయితే ఆ సంస్థ డైరెక్టర్ ప్రకాశ్ మరణంతో కొత్త దరఖాస్తులను కోరినట్లు చెప్పారు. మూడు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో ఆదర్శ్ రూరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అప్పగిస్తూ రెండు సార్లు కౌన్సిల్ తీర్మానం చేసినట్లు తెలిపారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం ఈ వ్యవహారం కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉందని చెపుతున్నారని చెప్పారు. కౌన్సిల్ ఆమోదం పొందిన సంస్థకు అనుమతి మంజూరు చేయాలని చైర్‌పర్సన్ కలెక్టర్‌ను కోరారు.

పెదభోగిలిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధిలో గల సుంకర వీధిలో గల పైడితల్లి అమ్మవారి గుడికి వెళ్లే మార్గం గుండా తుప్పలు, డొంకలు ఉండడంతో భక్తులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన వార్డు మెంబర్ పిన్నింటి లక్ష్మి తమ వీధిలో ఉన్న గుడికి రహదారి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని పంచాయతీ ఇఒ, సర్పంచ్‌ను కోరారు. అయితే వీరు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో వీధిలో ఉన్న పెద్దలు, యువకులతో కలిసి రహదారికి వెళ్లే మార్గంలో తుప్పలు, డొంకలు, మురుగునీరు నిల్వలను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిన్నింటి రామారావు, బి.రామారావు, వి.వెంకటరమణ, వెంకన్న, యువకులు పాల్గొన్నారు.


దేరువాడ వద్ద అదుపు తప్పి పక్కకు ఒరిగిన బస్సు

అదుపు తప్పిన బస్సు... తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దేరువాడ సమీపాన పార్వతీపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు బీరుపాడు నుంచి కురుపాం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పింది. బస్సులో 118 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డు వెడల్పుగా లేకపోవడంతో పాటు రహదారికి ఇరువైపులా తుప్పలు, డొంకలు ఉండడం వల్ల బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందనిలీ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని, సురక్షిత ప్రయాణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాల బాలికలు స్నేహ పూర్వక వాతావరణంలో క్రీడా ఎంపికలో పాల్గొనాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14,17 మండల స్థాయి క్రీడా ఎంపికలను ఆమె ప్రారంభించారు. క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, హెచ్‌ఎం భీముడు, ఎంఇఒ చంద్రశేఖర్, తహశీల్దార్ శేఖరం, స్కూల్ చైర్మన్ రాజేష్, భూషణ్ రావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుమ్మ రైతు సేవా కేంద్రంలో చోరీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ రైతు సేవా కేంద్రంలో దొంగతనం జరిగిన సంఘటన కలకలం రేపింది. కేంద్రం తాళాలు పగలగొట్టి లోపల ఉన్న కంప్యూటర్ సిస్టమ్‌ను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయారు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం కేంద్రం సిబ్బంది కార్యాలయానికి చేరుకున్నప్పుడు తాళాలు పగిలి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దొంగలు కంప్యూటర్‌తో పాటు మౌస్, కీబోర్డ్ వంటి పరికరాలు కూడా ఎత్తుకుపోయినట్లు తెలిపారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులు రైతు సేవా కేంద్రంలో భద్రతా చర్యలు బలోపేతం చేయాలని కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : రైతు సంఘం

బలిజిపేట : పాలకొండలో ఈనెల 16న జరగనున్న ఎపి రైతుసంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, అధ్యక్ష కార్యదర్శులు మండల గోవింద, ఆవు సాంబమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మహాసభల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సాగునీరందంచాలని, కాలువలోని పూడికలు తీసి లైనింగ్ పూర్తిచేసి కాలువ చివర్లో నీళ్లు అందంచాలని, తదితర సమస్యలన్నింటిపై మహాసభలో చర్చించుకున్నట్టు తెలిపారు. కావున రైతులంతా ఈ మహాసభలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దన్నాన తిర్నాథ, పాలీల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు


మక్కువలో వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశాలు


కురుపాంలో నిరసన తెలుపుతున్న ఆశాలు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎపి ఆశా వర్కర్స్, సిహెచ్‌డబ్ల్యు సంఘం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ, శంబర పిహెచ్‌ల పరిధిలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణారావు, ఆశా వర్కర్స్‌యూనియన్ నాయకులు సరస్వతి, లక్ష్మి, సరోజిని, సిహెచ్‌డబ్ల్యు నాయకులు విజయ మాట్లాడారు. ప్రమాదవశాత్తు అనారోగ్యంతో మృతి చెందిన వారికి నేటికీ దహన సంస్కార ఖర్చులు ఇవ్వడంలేదని, వెంటనే ప్రభుత్వం అన్ని పథకాలను అందించాలని కోరారు. రాష్ట్రంలో పెరిగిన ధరలకు తగ్గట్టుగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ఆన్లైన్ పనులు రద్దు చేయాలని, 5జి సిమ్ ఫోన్లు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

సీతానగరం : సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీతానగరం, పెదంకలాం పిహెచ్‌సిల సిహెచ్‌ఒలకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, రాయిపల్లి రాము, ఆశా వర్కర్ నాయకులు అన్నపూర్ణ, రవణమ్మతో పాటు వివిధ గ్రామాల చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిరా డిమాండ్ చేశారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం పిహెచ్‌సిల పరిధిలో గల ఆశా వర్కర్లతో కలిసి వారి సమస్యలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ నాయకులు సరోజిని, దమయంతి, గౌరీ, రవణమ్మ, అంజలి, కల్పనా, మీనాక్షి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని బలిజిపేట, అరసాడ, గళావల్లి పిహెచ్‌సిల్లో ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా గుర్తించాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ నిరసనలు తెలియజేసి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, యూనియన్ నాయకులు , లక్ష్మి, అరుణ, వీరమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో కష్ణవేణి, మంగ, అప్పల నరసమ్మ, భాగ్యం, శోభ, పార్వతి, చిన్న, శ్రీదేవి, అధిక సంఖ్య ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని తాడికొండ పిహెచ్‌సిలో హెచ్‌వికి ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వినతిని అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కె.నిర్మల, బి.శ్యామల, కృష్ణ వేణి, గౌరమ్మ, సుజాత, అమల కుమారి, పార్వతి, అమ్మాజీ, దమయంతి, కాంచన, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎపి, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, ఎన్ .సింహాచలం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో యశోద, అరుణ, జ్యోతి, నీలిమ, శ్రీదేవి, వనజ, కృష్ణ, తదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : మండలంలోని బాగువలస, తోణాం, మామిడిపల్లి పిహెచ్‌సిల పరిధిలో గల ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో వినతి పత్రాన్ని మక్కువలో మెడికల్ అధికారుకు యూనియన్ అందించింది. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు , ఆశ యూనియన్ నాయకులు రాజేశ్వరి సునీత భారతి అన్నపూర్ణ రమణమ్మ ఆదిలక్ష్మి మరియమ్మ సిహెచ్ డబ్ల్యు నాయకులు రవణమ్మ, వరలక్ష్మిలతో మాట్లాడారు.

కొమరాడ : మండలంలోని కొమరాడ, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా, సిహెచ్‌డబ్ల్యుఒలు నిరసన తెలిపి, అనంతరం హెచ్‌విలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆశా వర్కర్ల నాయకులు హేమలత, హైమా, రాజేశ్వరి, పార్వతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు రాధ, సుజాత, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

మహాకవి, మనకు రామాయణాన్ని అందించిన వాల్మీకి మహర్షి కారణజన్ముడని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి కొనియాడారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఎంతో విలక్షణమైనదని, తన రామాయణ ఇతిహాసం మానవాళికి రచించిన తొలి గ్రంథమని అన్నారు. ఆదికావ్యమైన వాల్మీకి రామాయణం భారతీయ భాషలోనే కాక అన్ని ప్రాంతాల్లో ఆదరణ పొందిందని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, ఇతర అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జ్ఞాన సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎస్‌పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి వాల్మీకి చూపిన మార్గాన్ని అనుసరించాలంటే నైతికత, సేవా భావం అవసరమని అన్నారు. అలాగే పోలీస్ సిబ్బంది సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే మహర్షి వాల్మీకి చూపిన ధర్మపథం అనుసరించాల్సిన అవసరం ఉందని, ఆయన ఆలోచనలు, బోధనలు నేటి యువతకు జీవన దిశా నిర్దేశం అవుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీ సిఐ రమణమూర్తి, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, ఆర్ఐ రాంబాబు, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శంకరరావు, ఆర్ఎస్ఐలు, కార్యాలయంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నుంచి చైర్‌పర్సన్ వాకౌట్

- సభ్యులకు, చైర్‌పర్సన్‌కు మధ్య వాదోపవాదాలు
- అసహనానికి గురై చైర్‌పర్సన్
- మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు తాత్కాలిక చైర్‌పర్సన్‌గా మంత్రి ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎన్నడూ లేని విధంగా అసాధారణ సంఘటన జరిగింది. కొత్తవరవడికి తెరలేపారని చెప్పవచ్చు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో అజెండాలో పొందుపర్చిన 12 అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపిస్తుండగా ఒకటో అంశంలో పొందుపర్చిన గత ప్రభుత్వ హయాంలో గడపగడపకు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లు చెల్లింపులు సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదానికి అజెండాలో పొందుపర్చగా, పలువురు టిడిపి కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఆ పనులు జరగలేదని, ఈ అంశాన్ని వాయిదా వేయాలని నిరసన తెలియజేస్తూ నిలబడడంతో ఈ అంశం వాయిదా పడింది. అనంతరం అజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పనుల విషయమై చర్చకు రాగా, ఆయా వార్డుల కౌన్సిల్ సభ్యులకు తెలియజేసి పనులు చేపట్టాలని చైర్పర్సన్ ఎఇ సన్యాసిరావుకు సూచించారు. కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా, 8, 10వ వార్డు కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, జలుమూరి దివ్య వార్డు సమస్యలపై చైర్‌పర్సన్‌కు చెపుతున్న సందర్భంగా వీరి మధ్య వాదోపవాదాలు జరుగుతుండగా అసహనానికి గురైన చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి బెల్ కొట్టి సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోయారు. దీంతో సమావేశం కొనసాగించేందుకు స్థానిక ఎమ్మెల్యే మున్సిపల్ మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు తాత్కాలిక చైర్పర్సన్‌గా 23వ వార్డు కౌన్సిల్ సభ్యురాలు మంత్రి ఉమామహేశ్వరిని సమావేశాన్ని నడిపేందుకు మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారము తాత్కాలిక చైర్‌పర్సన్‌గా కొనసాగింపు జరిపించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజుకు తెలిపారు. దీంతో ఆయన తాత్కాలిక మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరిని సాధారణంగా ఆహ్వానిస్తూ, కుర్చీపై కూర్చుండబెట్టడంతో కౌన్సిల్ సభ్యులతో పాటు, మున్సిపల్ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ విషయంపై ఎఫ్‌ఎసి కమిషనర్‌కు పత్రికా ముఖంగా వివరణ కోరగా, మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారమే తాత్కాలిక చైర్పర్సన్ నియమించి ఈ సమావేశాన్ని నడుపుతున్నట్టు తెలపడం విశేషం. తాత్కాలికంగా ఎన్నికైన చైర్పర్సన్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగుతుండగా, పలు వార్డుల సమస్యలను ఆయా వార్డుల కౌన్సిలర్లు తెలియజేయగా, ఆయా వార్డుల్లో సమస్యలను టెండర్లు పిలవకుండానే యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పట్టణ అభివృద్ధికి పనిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లుతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.


చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరిని కుర్చీపై కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే

ఏజెన్సీ రోడ్ల నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ పెరగాలి

సిపిఎం మన్యం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - పాచిపెంట

మన్యం జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తున్న గ్రామీణ ప్రాంత రోడ్లను వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా ఐటిడిఎ పిఒ, కలెక్టర్ కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు మండలంలో నిర్మాణంలో ఉన్న శతాబి జంక్షన్ నుంచి తంగలం సెల్ టవర్ వరకు నిర్మిస్తున్న రోడ్లను మంగళవారం సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కె ఈశ్వరరావు, సభ్యులు డి.పండు మాట్లాడారు. శతాబి నుండి తంగలం వరకు వేసే రోడ్డంతా పూర్తిగా కొండలను ఆనించి నిర్మించి ఎక్కువ భాగం జరుగుతుందని, వర్షాకాలంలో కొండల నుంచి వచ్చే నీరు వల్ల రోడ్డు ఎక్కువ కోతకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. రోడ్డు నిర్మాణంలో అవసరమైన చోట రోడ్డు కోతకు గురి కాకుండా సేఫ్టీ వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. సుమారు 15 గ్రామాలను, అల్లూరి జిల్లా మండలాలకు కలిపే ఈ రోడ్డు నిర్మాణాన్ని వీలైనంత తొందరగా పూర్తి చేస్తే ప్రజల అవసరాలు, విద్యార్థుల చదువులు, ప్రజల కు వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందని అన్నారు. అలాగే సాలూరు పట్టణం నుంచి బంగారమ్మపేట, బొడ్డవలస మీదుగా వేసే రోడ్లు నాసిరకంతో తక్కువ సమయంలోనే వర్షాలకు కోతకు గురైన ఘటనలు ఉన్నాయన్నారు. తోణాం నుంచి ఎగువ శంబికి వెళ్లే రోడ్ల నిర్మాణంలో రోలింగ్ గట్టిగా చేయకపోవడం, కొండల నుంచి వచ్చే నీరు ప్రవాహానికి సేఫ్టీ వాల్ లేకపోవడంతో తారు రోడ్లు మూడు ,నాలుగు నెలల్లోనే పగుళ్లు, కోతకు గురైన సంఘటనలున్నాయన్నారు. ఈ సంఘటనలను దృష్టిలో అధికారులు పర్యవేక్షణ పెంచి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు.

మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో ప్రతిఏటా పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని, కానీ ఎటువంటి శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడం లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ఎం.నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 13 మంది గిరిజన విద్యార్థులు మృతి చెందారన్నారు. ఇమృతి చెందిన గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు కనీసం రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. మృతి చెందిన పువ్వల అంజలి తల్లికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

గురుకులం మౌలిక వసతులపై గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి

కురుపాం : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సందర్శనకు మంగళవారం విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌కు గిరిజన సంఘం నాయకులు పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని వినపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో అరకొర వసతులతో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారని, కావున అన్ని ఆశ్రమ పాఠశాలలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని వినపత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకష్ణారావు, ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో కంటే గౌరవమైందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం స్థానిక ఐటిడిఎలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయులు నిజాయితీ, నిబద్ధతతో తమ విధులను నిర్వర్తిస్తే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయమవుతుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంతో ఓపిక, పట్టుదల ఉంటుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం ఐటిడిఎ పరిధిలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి షీల్డ్, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ జి.రాంమోహన రావు, ఐటిడిఎ ఎఒ వి.సునీల్, సూపరింటెండెంట్ ఎటిడబ్ల్యూఒ సూర్యం అప్పారావు, పిఎంఆర్‌సి సిబ్బంది, రాములమ్మ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పిడిఎస్ బియ్యం పట్టివేత

గుమ్మలక్ష్మీపురం : ఆంధ్రా నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. రెండు వాహనాల్లో 90 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాలను సీజ్ చేసినట్లు విజిలెన్స్ సిఐ సతీష్‌కుమార్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన బుడుమూరు రామకృష్ణ, రవి పై క్రిమినల్ కేసు నమోదు సివిల్ సప్లై డి టి పి శ్రీనివాసరావు తెలిపారు

కనీసం పరామర్శలకైనా రాలేదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ బిడ్డలకు పచ్చకామర్ల వ్యాధి కాటు వేయడంతో ప్రాణాలు కోల్పోయారని, పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను పరామర్శించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇటు ప్రభుత్వ అధికారులు కనీసం రాలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కంబగూడ, దండు సూర గ్రామాలకు చెందిన పువ్వల అంజలి, కల్పన ప్రభుత్వ వైఫల్యం, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తమ పిల్లలు చనిపోయారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా సెలవులకు పిల్లలు ఇంటికి వచ్చి అనారోగ్యంతో మృతి చెందితే తమకు సంబంధం లేదన్నట్టుగా అధికారులు, మంత్రులు వ్యవహరించడం సరికాదన్నారు. సరైన వైద్యం అందించక పిల్లలను పొట్టన పెట్టుకున్నారని కన్నీటి పర్యంతం అవుతున్నారు. చెట్టంత ఎదిగిన తమ బిడ్డ బాగా చదివి మంచి ఉద్యోగం చేస్తాదని ఆశిస్తే చివరికి కన్నీరే మిగిలిందని రోదిస్తున్నారు. ఇటువంటి కష్టం మరి ఎవరికీ రాకూడదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పారదర్శకతకే స్మార్ట్‌కార్డులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పౌరసరఫరాల వ్యవస్థలో పారదర్శకంగా ఉండేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తుందని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల కేంద్రంలో ఎంపిపి ఉరిటి రామరావుతో కలిసి మంగళవారం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డుల వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడు (రాంబాబు), రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), బోను చంద్రశేఖరరావు, బోను సురేష్, బాణాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో వ్యాధులపై దృష్టి పెట్టాలని ఆశా వర్కర్ల నోడల్ అధికారి ఒ.శాంత కుమారి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తరచుగా గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని జ్వరాలు ఉన్నట్లయితే తక్షణమే రక్త పూతలు సేకరించాలన్నారు. గర్భిణీలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు పౌష్టికాహారమందేలా చూడాలన్నారు. జనన, మరణాలు వివరాలు పొందుపర్చాన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి నెలా 9న ఆసుపత్రుల జరుగు వైద్యతనిఖీలకు గర్భిణీలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంప్రదాయ పంటలు పండించాలి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన ప్రాంతాల్లో పండే సాంప్రదాయక పంటల వల్ల ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని, ఇక్కడ పండే పంటలకు అధిక ధరలు పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాధికారి కె.శిరీష తెలిపారు. మంగళవారం గిరిశిఖర కోటియా గ్రూప్ గ్రామం గంజాయిభద్ర రైతు సేవాకేంద్రం పరిధిలో దిగువ సెంబిలో పొలం పిలుస్తుంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ మాట్లాడుతూ గిరిజన రైతులంతా పోడు, అటవీ భూములు ఎక్కువగా సాగు చేస్తున్నారని వీటిని సాంప్రదాయక పద్ధతుల్లో పండించే చిరుధాన్యాలు రాగి, సామ, కొర్రలు సాగుచేయడం వల్ల వ్యవసాయ మార్కెట్‌లో మంచి ధరలు లభించడమే కాకుండా రైతులు తమ సొంతంగా తిండికి వాడుకోవడం వల్ల మంచి పౌష్టిక ఆహారం లభిస్తుందని తెలిపారు. రైతులకు వ్యవసాయ పరికరాలు రాయితీపై లభిస్తాయని, ప్రభుత్వం ద్వారా యంత్ర పరికరాలు వచ్చినప్పుడు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మొక్కజొన్న పంట నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు ఇ- పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

ముగ్గురు వ్యక్తుల వద్ద 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద ముగ్గురు వ్యక్తులను గంజాయితో పట్టుకున్నామన్నారు. వీరు ఒడిశాలోని జయపూర్ ఆంధ్రా మీదుగా కాశీ వెళ్లేందుకు కాలినడకన పి.కోనవలస చెక్‌పోస్ట్ దాటుతున్న సమయంలో ఆ ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేశామన్నారు. వీరి నుంచి ఒక గంజాయి ప్యాకెట్ లభించిందని, దీని బరువు సుమారు 5 కేజీలుగా ఒదన్నారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉన్నందున వారు సొంతానికి వినియోగించుకొనేందుకు కొన్నట్లు తెలిపారు. వీరిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.